# సత్యాగ్రహం

సత్యకు ఆగ్రహం వచ్చింది. ఎప్పుడూ నవ్వుతూ తుళ్ళుతూ ఉన్నట్టుండే సత్య బింకంగా అలిగినట్లుగా ఒక మూల కూర్చుండిపోవటం చూసిన తల్లిదండ్రులు కారణం ఏమై ఉంటుందా అని ఆలోచనలో పడ్డారు.

సత్యకు అలా కోపం రావటం రెండోసారి. మొదటిసారి అప్పటికి పది పన్నెండేళ్ళ క్రితం వచ్చింది. అప్పుడూ అంతే, సత్య తన కోపానికి కారణం ఏమిటో ఆమె చెప్పేవరకూ తల్లిదండ్రులూ కని పెట్టలేకపోయారు మరి.

సత్యతో పాటుగా ఆ అమ్మాయి తల్లిదండ్రులకు ఇంకో అబ్బాయి ఉన్నాడు. సత్య తండ్రి ప్రకాశరావు ఉద్యోగస్తుడు. తల్లి శారదాంబ గృహిణి. ఏవో చిన్న చిన్న ఒడిదుడుకులు ఉన్నాగానీ, వారిది సాఫీగా సాగిపోతున్న సంసారమే. పిల్లలు ఇద్దరూ చదువుకుని ఉన్న ఊళ్ళోనే ఉద్యోగాలు సంపాదించుకున్నారు. ఆ సంవత్సరమే ఇద్దరికీ కూడా పెళ్ళి సంబంధాలు కుదిరాయి. ఆ విషయం తల్లిదండ్రులకు బాగా ఆనందం కలిగించింది.

పెళ్ళి ఏర్పాట్లు గురించి అందరూ కూర్చుని మాట్లాడుకుంటున్నపుడు సత్య రుసరుస లాడుతూ విసురుగా లేచి ఓ పక్కకు వెళ్ళి కోపంగా కూర్చుంటే... తల్లిదండ్రులు ఇద్దరూ విషయం ఏమిటని ఆరా తీశారు.

అప్పుడు సత్య 'మీరేం అన్నారో, తప్పు ఏమిటో మీకు తెలియటంలేదా, మళ్ళీ ఆలోచించి చూడండి' అని చెప్పింది. వాళ్ళకేమీ తమ సంభాషణలో తప్పు కనిపించలేదు. ఒకటికి రెండుసార్లు గుర్తుచేసుకుని, తరచి చూసుకున్నా అంతే. అదే చెప్పి, ఆమెనే కారణం చెప్పమని అనునయంగా అడిగారు.

''తమ్ముడినీ, నన్నూ ఒకేలా పెంచారు, ఏం చదువుతామన్నా సరేనని అంగీకరించారు. అవునా... మరి అలాంటపుడు పెళ్ళి విషయంలోనూ ఇద్దరినీ ఒకేలా ఎందుకు

చూడలేకపోతున్నారూ? అపుడెపుడో మీరు కొన్న స్థలాన్ని అమ్మి ఒక అపార్ట్ మెంట్ తీసుకుందామని అనుకున్నారుగా..?''

ప్రకాశరావు కూతురివైపు చూస్తూ అవునంటూ తలావూపారు. ఆ స్థలంలో ఇల్లు కట్టించడమంటే చాలా ప్రయాస అందుకని ఓ అపార్ట్ మెంటు తీసుకుందామని నిర్ణయించుకున్నాం. కానీ ఇపుడు చక్కగా మీ ఇద్దరికీ ఒకేసారి సంబంధాలు కుదిరాయి కాబట్టి ఆ స్థలాన్ని అమ్మిన డబ్బుని నీ పెళ్ళికి కట్నంగా ఉపయోగించడం బావుంటుందనుకుంటున్నాం. ఇదే ఇంటిలో అద్దెకు ఇలాగే కొనసాగితే సరిపోతుంది. బాధ్యత తీరటం ముఖ్యం కదా...'' అని అన్నారు.

సత్య రుసరుసలాడుతూ ''ఇదే నాకు కోపం తెప్పించింది. స్థలం అమ్మి ముందు అనుకున్నట్లుగా అపార్టమెంటునే తీసుకోండి. పెళ్ళి ఖర్చులకు లోన్ తీసుకుంటానంటున్నారుగా, నిరాడంబరంగా ఇద్దరికీ జరిపించండి...'' అంది.

ప్రకాశరావు కొంచెం ఆలోచనలో పడినట్లు చూస్తూ ''అలా ఎలా వీలవుతుందమ్మా.. వాళ్ళకి కట్నం ఇస్తానని చెప్పాకదా...?'' అన్నారు.

''ఆ విషయం అప్పుడు నాకు తెలియలేదు. ఇపుడే తెలిసింది మరి! ఇలా నాకు ఇష్టం లేదని చెప్పండి వాళ్ళకు. నాన్నా... ప్రస్తుతానికి పెళ్ళి ఆలోచనకు ఫుల్ స్టాప్ పెట్టండి. కొన్నాళ్ళు ఉద్యోగం చేస్తాను. ఆ తర్వాతయినా మీరు కొడుకుకి ఇచ్చినట్లే నాకూ తదనంతరం సగభాగం వస్తుందని చెప్పండి. అందుకు అంగీకరించిన వాళ్ళనే మనం ఆలోచించుకోవచ్చు. అమ్మాయిలు, అబ్బాయిలు సరిసమానంగా చదువుకుని ఉద్యోగాలు చేసుకుంటున్నపుడు ఈ పద్ధతే సరియైనది! అలా చేయకపోతేనే నన్ను చిన్నబుచ్చినట్లువుతుంది. మరి మీకు అమ్మాయీ, అబ్బాయీ సమానమేనని చెబుతూంటారుగా...?'' అనడిగింది సత్య.

తనేమైనా గట్టిగా అనుకుందంటే, ఆ అభిప్రాయం నుండి వెనకడుగువేయదని తెలిసిన ప్రకాశరావు కొంచెం సంశయంగా ''ఇంతవరకూ వచ్చాక ఇపుడు ఇలా చేయటం ఎలా అమ్మా...?'' అంటూ నసిగాడు.

అప్పుడు కొడుకు వికాస్ ''ఫరవాలేదు లెండి నాన్నా... ఆ అబ్బాయి మా ఇన్ స్టిట్యూట్ లో పనిచేసే నా ఫ్రెండేగా, ఈ విషయాన్ని నేనే చెబుతాలెండి'' అంటూ ఆ విషయానికి ముగింపు పలికాడు.

అయితే, వికాస్ ఈ విషయం చెప్పగానే పెళ్ళికొడుకు శంకర్ ఆ విషయంలో తనకేం అభ్యంతరం లేదనీ, తన తల్లితండ్రులూ అంగీకరిస్తానని చెప్పి భరోసా ఇవ్వటంతో అనుకున్న ముహూర్తాలకి ఇద్దరికీ పెళ్ళిళ్ళు జరిగిపోయాయి.

ఆ తర్వాత మూడేళ్ళకి ఇద్దరికీ వేరువేరు వూళ్ళకి ట్రాన్స్‌ఫర్ అవటంతో మకాం మార్చి అపుడపుడూ తల్లిదండ్రులను కుటుంబాలతో వచ్చి చూసి వెళ్తుండటం జరుగుతోంది. ఇద్దరికీ కూడా పిల్లలూ ఉన్నారు.

ఇపుడు ఇద్దరూ ఏదో సందర్భంగా తల్లిదండ్రుల దగ్గరకు వచ్చారు. అంతా కలిసి కూర్చుని మాట్లాడుకుంటున్న సందర్భంలోనే మళ్ళీ సత్యకు కోపం వచ్చింది. తమ సంభాషణల్లో ఏం తప్పు దొర్లిందా, ఇప్పుడు సత్యకు కోపం రావటానికి కారణం ఏమై ఉంటుందా అని ఆలోచనలో పడ్డారు.

ఇద్దరూ సత్యవైపు అయోమయంగా చూస్తుంటే... సత్య తల్లిని ఓ మాట అడిగింది.

''అమ్మా... నా చిన్నప్పుడు అపుడపుడూ రంగారావు తాతగారని ఒకాయన వస్తూండేవారు. నీకూ గుర్తుందా...?''

శారదాంబ నిట్టూర్చింది. 'ఎందుకు లేరూ...? ఏదో పనిమీద మనింటికి వచ్చి రెండు రోజులుండి వెళ్తూండేవారు. అది సరేగానీ, ఇపుడాయన ఎందుకు నీకు గుర్తు వచ్చారు...?' అని ఆరా తీసిందావిడ.

"నీతో ఆయనకు పెదనాన్న వరస అయ్యే దూరపు బంధుత్వం ఉందటకదా. చిన్నపుడు ఆ తాతగారి ఇంటి ప్రక్కనే మీరూ ఉండేవాళ్ళమని చెప్పావుగా... ఆ తాతగారు మీ పిల్లలందర్నీ తరచూ

హోటళ్ళకీ, సినిమాలకీ తీసుకువెళ్ళి అందరి ఇష్టాలను గమనించి వాళ్ళకు కావల్సినవన్నీ కొని పెట్టేవారని చెప్పావుకదా...!

ఒకసారి వచ్చినపుడు ఆ తాతగారు నీతో ఏమన్నారో గుర్తుందా..? 'మా ఇంట్లో కోడలిని నాకిది ఇష్టం అని చెప్పి చేయమని అడగలేనమ్మా... నువ్వు కూతురిగా నాకు కావలిసనవి ఆరా తీసి కనుక్కుని చేసి పెడుతూంటావు..నాకు కూతురు లేని లోటు నువ్వు తీరుస్తున్నావమ్మా...!' అని కదూ అన్నారు...! అపుడు నేనూ అక్కడే ఉన్నానుగా, ఆ తర్వాత నువ్వు నాతో ఏమన్నావ్...?

'ఆ తాతగారు ఏమన్నారో విన్నావా? ఆడపిల్లల దగ్గిరే తల్లిదండ్రులకు చనువు ఎక్కువుంటుంది కాబట్టి స్వతంత్రంగా కావల్సినవి అడగగలరు. అలాగే అమ్మాయిలకీ తల్లిదండ్రుల ఇష్టాలవీ తెలుస్తాయి కాబట్టి, వాళ్ళని చక్కగా చూసుకుంటుంది! మరి మమ్మల్ని అలా కనిపెట్టుకుని చూసే దానివి నువ్వే...!' అన్నావుగా...?"

శారదాంబ ఆలోచిస్తూ చూసి ''అయితే...?'' అనడిగింది కూతురిని.

సత్య తల్లివైపు చురుగ్గా చూసింది. ''మరి తమ్ముడు వాళ్ళ దగ్గరకు వచ్చెయ్య వచ్చుకదా అంటే నువ్వు ఏమన్నావ్...? 'మేం చేసుకోలేని రోజుల్లో నీ దగ్గరకు వచ్చి ఉండాల్సిందేకదా, ఇపుడు బాగానే ఉన్నాంలే, అపుడే ఎందుకూ?' అని చెప్పావా?''

శారదాంబ ఆశ్చర్యంగా చూసి ''అవునూ.... అయితే ఇందులో నీకు కోపం వచ్చే సంగతి ఏముందీ? నీ ప్రసక్తే లేదుగా...?'' అనడిగింది.

సత్య అలాగే చురుగ్గా చూస్తూ జవాబు చెప్పింది. ''అవును నిజమే నా ప్రసక్తే లేదు. అదే నాకు అవమానంగా అనిపించింది. చిన్నప్పుడేమో నాతో 'మమ్మల్ని చూడాల్సిన బాధ్యత నీదే' అని చెప్పినదానివి ఇపుడేమో ఇలా మాట్లాడటం ఏమిటి చెప్పు...? పిల్లలిద్దరూ సమానమే అయినపుడు... వాళ్ళని చూసుకోవాల్సిన సమయంలో కూతురికీ బాధ్యత ఉండదా? 'చేసుకోలేని రోజుల్లో పిల్లలదగ్గరే ఉండాలి కదా... మీ ఇద్దరే కదా మమ్మల్ని చూసుకోవాలీ' అని కదా నువ్వు చెప్పాల్సిన మాట...?''

‘‘ఇదేనా... నేనింకా ఏమిటో అనుకున్నానూ...’’ అంటూ బుగ్గన వేలేసుకుని మరీ ఆవిడ ఆశ్చర్యపోయింది.

ప్రకాశరావు వదనం వికసించింది.

‘‘అవును సత్యా... నువ్వు చెప్పింది చాలా సబబుగానే ఉంది! హక్కుల్లో మాత్రమే కాకుండా బాధ్యతల్లోనూ వాటా కావాలనుకునే నీ మాటలు చాలా ఆనందం కలిగిస్తున్నాయి! అమ్మాయి అయితే  పెళ్ళీ, పురుడూ వగైరా లాంటి బోలెడు ఖర్చులుంటాయని బరువుగా భావించే వాళ్ళకు నీ మాటలు కనువిప్పు కలిగిస్తాయి! అమ్మాయిల పద్ధతులన్నీ మారాయి కాబట్టి ఆలోచనలూ ఇలా మారితే కావాల్సిందేముందీ! తల్లిదం డ్రులు తమ పరిస్థితుల్ని బట్టి ఎలా ఎక్కడ సౌకర్యంగా ఉంటుందనుకుంటే అలా ఉండొచ్చు! ఇద్దరిపట్లా తేడాలేం ఉండకూడదని నీ మాటల అర్థం... అంతేకదా...!’’ అని ప్రకాశరావు అనగానే సత్య పెదవులపైకి చిరునవ్వు వచ్చింది.

తల్లి కూడా చిరునవ్వుతో " నువ్వు చెప్పింది నిజమే సత్యా...కోడలు సంస్కారవంతురాలైతే, బాధ్యతతో గౌరవంగా చూస్తుందిగానీ, కూతురు మాత్రం తనని ప్రేమగా పెంచిన తల్లిదండ్రులను అంతే ఆదరంగా, అభిమానంగా చూస్తుంది ! "

* * *